రోడ్డు కోసం డిమాండ్..!

- భీమారం నుంచి కుందారం వరకు బీటీ రోడ్డు వేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


ఆరెపల్లి -కుందారం మధ్య తాత్కాలిక రోడ్డు

భీమారం: మండల కేంద్రం నుంచి ఆరెపల్లి మీదుగా జైపూర్ మండలం కుందారం వరకూ రోడ్డు నిర్మిస్తే సుందిళ్ల ప్రాజెక్ట్ మీదుగా పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతం వెళ్లేందుకు రవాణా సదుపాయం మెరుగుపడనుంది. ఈ రోడ్డు కోసం కొన్నేళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు 50ఏళ్ల క్రితం భీమారం నుంచి ఆరెపల్లి అటవీప్రాంతం గుండా కుందారం వరకు తాత్కాలిక రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డు ద్వారా రాకపోకలు కొనసాగించేవారు. అయితే అటవీప్రాంతంలోని రోడ్డు గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వర్షాలకు తెగిపోయింది. కేవలం ద్విచక్ర వాహనాలతో పాటు ఎడ్లబండి మాత్రమే వెళ్లేందుకు అనుకూలంగా ఉంది.

పట్టింపు లేక...

ఆరెపల్లి నుంచి కుందారం వరకు దాదాపు ఏడు కిలో మీటర్ల దూరం రోడ్డు విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రతీ సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు తాత్కాలిక రోడ్డు తెగిపోతుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. బీటీ రోడ్డు రోడ్డు నిర్మిస్తామని గతంలో ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా, కార్యరూపం దాల్చలేదు. మరోవైపు వర్షాలకు రోడ్డు చాలా వరకు దెబ్బతింది.

రోడ్డు నిర్మిస్తే మేలు..

భీమారం నుంచి ఆరెపల్లి వరకు ప్రస్తుతం బీటీ రోడ్డు ఉంది. అక్కడ నుంచి కుందారం అటవీ ప్రాంతం గుండా కిష్టాపూర్ వరకు దాదాపు 10కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మిస్తే చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతం గోదావరి నది అవతలివైపు గల పెద్దపల్లి జిల్లా మంథని వైపు గల గ్రామాలకు వెళ్లాలంటే జైపూర్, గంగిపల్లి మీదుగా కిష్టాపూర్ వెళ్తున్నారు. అదే ఆరెపల్లి నుంచి కుందారం వరకు రోడ్డు నిర్మిస్తే దూరభారం తగ్గనుంది. కుందారం నుంచి కిష్టాపూర్ సమీపంలోని సుందిళ్ల ప్రాజెక్ట్ వరకు రోడ్డు ఉండగా, ఈ రోడ్డుని ఉపయోగించుకొని వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఈ రోడ్డు గురించి పట్టించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఆరెపల్లి సమీపంలో కల్వర్టు వద్ద తెగిన రోడ్డు

రోడ్డు నిర్మించాలి



ప్రభుత్వం మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసే కార్యక్రమంలో ఆరెపల్లి-కుందారం వరకు గల తాత్కాలిక రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలి. దీని ద్వారా చెన్నూర్ ప్రజలు చుట్టూ తిరిగి ప్రయాణించకుండా నేరుగా మంథని ప్రాంతానికి వెళ్లవచ్చు.

\- సిరిపురం మధుకర్, భీమారం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



భీమారం మండలం ఆరెపల్లి నుంచి కుందారం వరకు అడవిలో గల తాత్కాలిక రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. రోడ్డు నిర్మాణం జరిగితే గ్రామాలు కూడా మరింత అభివృద్ధి చెందుతాయి.

\- బుక్యా తిరుమల, జెడ్పీటీసీ


కొట్టుకుపోయిన రోడ్ డ్యాం

ఆక్రమణల తొలగింపు

- బెల్లంపల్లిలో ఫుట్‌పాత్‌పై షాపులు, టేలాల కూల్చివేత
- అడ్డుకునేందుకు కొందరి యత్నాలు
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు
- రోడ్డున పడ్డ మారు బేరం వ్యాపారులు


జేసీబీతో కూల్చివేస్తున్న ఓ షాపు కట్టడం

బెల్లంపల్లి: బల్దియా బజారుఏరియా ప్రాంతంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన షాపులు, టేలాల తొలగింపు చర్యలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇటీవల బజారుఏరియా ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో కలెక్టర్ బదావత్ సానుకూలంగా స్పందించి ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి పోలీసు బందోబస్తు మధ్య రోడ్డును ఆనుకుని, మురుగు నీటి కాలువను దాటి ఏర్పాటు చేసిన టేలాలను జేసీబీతో కూల్చివేయించారు. కాంటా చౌరస్తా నుంచి పాతబస్టాండ్ వరకు వరుసక్రమంగా తొలగింపు చర్యలు చేపట్టారు. మురుగు కాలువను దాటి కొంతమంది వ్యాపారులు షెడ్లను ఏర్పాటు చేశారు. తోపుడు బండ్లు, కొంతమంది మారు బేరం వ్యాపారులు రోడ్డు పక్కనే విక్రయాలు సాగిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు చోట్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణ కోసం టేలాల తొలగింపునకు నడుం బిగించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సామూహికంగా వచ్చి మురుగు కాలువను దాటి ఏర్పాటు చేసిన షెడ్లను పూర్తిగా కూల్చివేయించడంతో కలకలం రేగింది. ముఖ్యంగా రోడ్డు ఫుట్‌పాత్ ఆధారంగా కూరగాయల మారు బేరం చేసుకునే మహిళలు రోడ్డున పడ్డారు. కొందరు చిరు వ్యాపారులు షెడ్లను కోల్పోయారు. కట్టడాల శిథిలాలు, రేకులు, తడకలు, కొన్ని తోపుడు బండ్లను మున్సిపల్ ట్రాక్టర్‌లో ఎక్కించి పంపించారు.

కమిషనర్‌తో వాగ్వాదం..

ఆక్రమణ కూల్చివేతను పురస్కరించుకుని కొందరు మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డితో వాగ్వాదం చేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం ఏంటీ, చిరు వ్యాపారులు బతకొద్దా, బడా వ్యాపారుల షెడ్లను తొలగించకుండా చిరు వ్యాపారుల షాపులను జేసీబీతో కూల్చివేస్తారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందు వల్ల కలెక్టర్ ఆదేశాలతో నిబంధనలకు లోబడి మురుగు నీటి కాలువ దాటిన షెడ్లను, షాపులను కూల్చివేస్తున్నామని కమిషనర్ మల్లారెడ్డి సమాధానం చెప్పినా అదేమీ పట్టించుకోకుండా అడ్డు తగిలే చర్యలకు పాల్పడ్డారు. అక్కడక్కడా కొందరినుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఓ మాజీ కౌన్సిలర్ జేసీబీని అడ్డుకునేందుకు సిద్ధపడగా పోలీసులు వచ్చి నియంత్రించారు. ఆ తర్వాత కూల్చివేతల పర్వం కొనసాగింది.

కట్టడి చర్యలు నిరంతరం చేస్తాం...

బజారు ఏరియా ప్రాంతంలో మురుగు నీటి కాలువను దాటి రోడ్డుపైకి వచ్చి షెడ్లను, టేలాలను ఏర్పాటు చేస్తే ఏమాత్రం ఊరుకోమని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి స్పష్టం చేశారు. ఇకపై నిరంతరం కూల్చివేతలు ఉంటాయని తెలిపారు. వాహనాలు రోడ్డుపై సాఫీగా వెళ్లడానికి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా, ఫుట్‌ఫాత్‌ను ఆక్రమించకుండా కట్టడి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. వన్‌టౌన్ ఎస్సైలు రమేష్, సురేష్ బందోబస్తు చేపట్టగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ కల్పించాలి

భీమారం: ప్రతీరోజు చెన్నూర్ నుంచి హైదరాబాద్ నడిచే లహరీ బస్సుకు భీమారం నుంచి రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. భీమారం దాటి చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రతీరోజు కనీసం పలువురు ఈ బస్సు ద్వారా హైదరాబాద్‌కి తరలివెళ్తుంటారని తెలిపారు. ప్రస్తుతం లహరీ బస్సుకి కేవలం చెన్నూర్ నుంచి రిజర్వేషన్ సదుపాయం కల్పించడంతో భీమారం ప్రాంత ప్రజలు చెన్నూర్ నుంచి రిజర్వేషన్ చేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. బస్సు డ్రైవర్‌కు ఫోన్‌చేసి భీమారంలో ఎక్కుతాం అని చెప్పాల్సి వస్తోందన్నారు. అధికారులు చర్యలు తీసుకొని భీమారం నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించండి


రశీదు అందజేస్తున్న కమిషనర్ సతీష్

నస్పూర్: పట్టణ ప్రజలు సకాలంలో తమ ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ సతీష్ కోరారు. పట్టణ పరిధిలోని 15, 20వ వార్డులలో మంగళవారం ఆయన ఆస్తి పన్ను వసూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–2023ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ ఉందని, ఈ అవకాశం ఈ నెల 31వరకు చెల్లించిన వారికే అని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై చర్చ

నస్పూర్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎన్నికల కోడ్ పాటించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సతీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రవికుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అధికారులు సమావేశమై మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై చర్చించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా పట్టణంలో ఎలాంటి రాజకీయ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని సూచించారు. ఎలాంటి రశీదు లేకుండా రూ.50వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లరాదన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై త్వరలోనే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

పాతమంచిర్యాల: మంచిర్యాల మున్సిపాలిటీలోని 36వార్డులలో బుధవారం మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి పైప్‌లైన్‌ల సాధారణ మరమ్మతుల కారణంగా ఒక్కరోజు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని అండాళమ్మకాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా సాధికారతపై అధికారులు మహిళలకు అవగాహన కల్పించారు. మహిళా సా.దికారత హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్సియల్ లిటరసీ లిప్సిక పలు చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందన, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, మహిళలు పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి సాధించిన ఆర్కే 5 గని

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5 గని వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31నాటికి 2.7లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాల్సి ఉంది. ఈ మొత్తాన్ని మంగళవారం నాటికి సాధించినట్లు గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, అధికారులు సమష్టిగా పని చేయడంతో ఈ లక్ష్యాన్ని సాధించామన్నారు. ముమ్ముందు కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి


సమావేశమైన అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని నాయబ్ తహసీల్దార్ హరిత సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 32పోలింగ్ కేంద్రాల్లో వసతులు సమకూర్చాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, మంచినీటి వ్యవస్థతో పాటు దివ్యాంగుల కోసం ర్యాంప్ సిద్ధం చేసి ఉంచాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా చూడాలన్నారు. సమావేశంలో సెక్టోరల్ అధికారి వెంకటేష్, ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, గిర్దావర్లు ప్రభు, మంగ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, హాజీపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లహరి, ఏఎస్సై చాంద్‌పాషా, వ్యవసాయ శాఖ ఏఈఓ కనకరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పోషణ పక్వాడా'


అన్నప్రాసన చేయిస్తున్న రాధిక

కాసిపేట: మండలంలోని బుగ్గగూడలో మంగళవారం పోషణ్ పక్వాడాలో భాగంగా ఐసీడీఎస్ రాధిక ఆధ్వర్యంలో అన్నప్రాసన, లంబాడితండా సెంటర్‌లో అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలని, ఆరు నెలలు నిండిన తర్వాత ఆహారం పెట్టాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఫ్రీ స్కూల్ విద్యా అందిస్తారన్నారు. పోషణ ప్రతిజ్ఞ చేయించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రాజమణి, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సీడీపీవో ఉమాదేవి

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

బెల్లంపల్లిరూరల్: చిన్నారులు, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో ఉమాదేవి అన్నారు. బెల్లంపల్లి మండలంలోని బుధాకుర్ద్-2 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఉమాదేవి చిన్నారుల తల్లులకు ఆరోగ్యవంతమైన పోషకాహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలు నిండిన పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు శంకరమ్మ, తిరుపతమ్మ, భారతి, భానుమతి, ఆయాలు, చిన్నారుల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న ఆటో సీజ్

భీమారం: మండలంలోని బూర్గుపల్లి సమీపంలో ఆటోలో నాటుసారా తరలిస్తున్న దరావత్ రాజేష్‌ను మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి అతడి వద్ద 15లీటర్ల సారా స్వాధీన పర్చుకొన్నట్లు మంచిర్యాల ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. బూర్గుపల్లి అటవీ ప్రాంతంలో నాటుసారా తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం రావడంతో తమ సిబ్బందితో ప్రధాన రోడ్డుపై పెట్రోలింగ్ చేస్తుండగా అటు వైపు అనుమానాస్పదంగా ఆటో రావడంతో అనుమానంతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


నిందితుడితో సీఐ గురువయ్య

కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించిన ఈడీ

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీపతినగర్‌లో వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖీ ఆధ్వర్యంలో నడుస్తున్న వయోజన విద్యా, కుట్టు మిషన్ కేంద్రాన్ని మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గప్రసాద్ సందర్శించారు. మహిళలు విద్యతో పాటు కుట్టు మిషన్ శిక్షణ నేర్చుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. డీఆర్‌పీ అశోక్‌రావు, కో ఆర్డినేటర్ గోపిక, ట్రైనర్ శారద ఉన్నారు.


మాట్లాడుతున్న దుర్గప్రసాద్

పంటల సాగుపై రైతులకు అవగాహన

బెల్లంపల్లిరూరల్: పంటల సాగులో మెలకువలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందవచ్చని జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల రైతువేదికలో 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా మందులు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఆయిల్ ఫామ్ సాగులో పాటించాల్సిన పద్ధతుల గురించి కొండా లక్ష్మణ్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయ డీన్ రాజశేఖర్ వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి డి.వందన, తాండూర్ మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవోలు శ్రీనివాస్, శంకర్, పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్యంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

రామకృష్ణాపూర్: హైదరాబాద్‌కు చెందిన జీవీకే ఫౌండేషన్ వైద్యుల ఆధ్వర్యంలో అత్యవసర వైద్యంపై మంగళవారం స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. బేసిక్ లైఫ్ సపోర్ట్, అడ్వాన్స్‌డ్ ట్రామా లైఫ్ సపోర్ట్ అంశాలపై వైద్యులు, స్టాఫ్‌నర్స్, వార్డు బాయ్స్‌కు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ జయవాణి, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ రవి, సంక్షేమాధికారి జీడుల శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన ఆండాళ్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా పీఆర్టీయూ నాయకులు సంఘ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు రాసపల్లి రవి, శంకర్, తిరుపతి, సత్తయ్య, పింగిళి వేణుగోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కళాశాల మూసివేస్తే భవిష్యత్ ఎలా...?

- విద్యార్థుల ఆందోళన


స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మందమర్రిరూరల్: జిల్లా కేంద్రంలో నడిచే వివేకానంద కాలేజ్ ఆఫ్ పాలిటెక్నిక్ యాజమాన్యం ఎలాంటి విద్యాబోధన చేయకుండా మూసివేతకు సిద్ధపడుతున్నారని మా భవిష్యత్ ఎలా అని ఆ కళాశాల విద్యార్థులు మంగళవారం మందమర్రిలోని ఓ స్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొంత కాలంగా కళాశాల యాజమాన్యం ఆర్థిక ఇబ్బందుల పేరిట క్లాసులు నడపడం లేదని, కళాశాల మూసివేస్తామని కళాశాల నిర్వాహకులు చెప్పడం వల్ల భవిష్యత్ చదువు ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో చదివే విద్యార్థుల చదువు అయ్యేంత వరకు కళాశాల నడిపించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదని వాపోయారు. కళాశాల నిర్వాహకులు మందమర్రిలోని ఓ పాఠశాల నిర్వాహకులని తెలుసుకుని వచ్చి అడిగితే దురుసుగా ప్రవర్తించారన్నారు. కళాశాలలోని విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఉన్నతాధికారులు పట్టించుకొని విద్యాబోధన జరిగేలా చూడాలని కోరారు. ఈ విషయమై విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని చదువు మధ్యలో కళాశాల మూసివేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పట్టించుకొని కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకొని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

స్టడీ రూం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం

తాండూర్: ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం యువత స్వచ్ఛందంగా స్టడీ రూం ఏర్పాటు చేసుకుని పరీక్షలకు సన్నద్ధమవడం అభినందనీయమని జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. మండలంలోని బోయపల్లిలో మంగళవారం కొంతమంది నిరుద్యోగ యువత సమన్వయంతో ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్ లైబ్రరీ(స్టడీ రూం) ను ఆయన పరిశీలించారు. ఎలాగైన ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని తపనతో యువత ప్రైవేట్ లైబ్రరీని ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. ఉద్యోగాల సాధనే కాక, మంచి లక్ష్యాలు ఏర్పర్చుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.


యువకులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

అక్రమంగా నగదు తరలిస్తే చర్యలు

బెల్లంపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పరిమితికి మించి అక్రమంగా నగదు తరలిస్తే చర్యలు తప్పవని బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. బెల్లంపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయ సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రూ.50వేలు పరిమితికి మించి డబ్బులు తీసుకెళ్లొద్దని సూచించారు. ఎన్నికల కమిషన్ విధించిన ఆంక్షలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరించినా, వాహనాలు అనుమానాస్పదంగా కనిపించినా, ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సీఐ వెంట బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై రమేష్, సిబ్బంది ఉన్నారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

సంక్షిప్త వార్తలు

పరీక్ష కేంద్రాలు తనిఖీ

నెన్నెల: మండల కేంద్రంలోని నెన్నెల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ రీక్ష కేంద్రాలను మంగళవారం ఫ్లైయింగ్ స్క్వాడ్ భీమ్‌రావు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రం ఆవరణను పరిశీలించారు. ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాల రవాణాలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా పరీక్షలు

జన్నారం: మండలంలో పది పరీక్షలు రెండో రోజు ప్రశాంతంగా జరిగాయి. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి తనిఖీ చేశారు.

నూతన కార్యవర్గం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మత్స్య ప్రాథమిక పారిశ్రామిక సహకార సంఘం హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి మత్స్య శాఖా జూనియర్ ఇన్‌స్పెక్టర్ జి.నితిన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. సంఘం నూతన అధ్యక్షుడిగా గునిగంటి భూమయ్య ఎన్నికయ్యారు.

బీసీ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా కమిటీని నియమించారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా శ్రీరాంపూర్ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న బరుపటి మారుతి, సెక్రెటరీగా బొడిగే చంద్రశేఖర్‌లను నియమించినట్లు అసోసియేషన్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పేరం రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు ప్రారంభం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో పశుసంవర్ధక శాఖ మండల పశువైద్యాధికారులు శాంతిరేఖ, సరిత ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. 156ఆవులు, 174గేదెలకు టీకాలు వేశారు.

యూనిఫాం స్టిచ్చింగ్‌పై అవగాహన

జైపూర్: మండల కేంద్రంలోని మండల సమైక్య ఆఫీస్‌లో మంగళవారం జైపూర్, భీమారం మండలాల్లోని మహిళా సంఘాలతో విద్యార్థుల యూనిఫాం స్టిచ్చింగ్‌పై డీఆర్‌డీవో కిషన్ అవగాహన కల్పించారు.

'బహుజనులను నమ్మించి మోసం చేసిన ఆర్‌ఎస్పీ'

చెన్నూర్: బహుజన వాదం పేరుతో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బహుజనులను నమ్మించి మోసం చేశారని పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు మద్దెల భవాని ఆరోపించారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.